# ఈ గండం గడవనివ్వండి

సుబేదార్ సుబ్రహ్మణ్యం చక్కా లాగ తిరిగి వచ్చాడు నాలుగేండ్లు మిలిటరీలో ఫీల్డు సెర్వీస్‌చేసి—చెక్కు చెదరలేదు మనిషి ముఖాన్ని బొప్పికూడా ఎన్నడూ కట్టలేదట. మళ్ళీ పాశ్చాత్యఖండంలోని విజయం ప్రాచీన ఖండమందలి విజయం రెండూకూడా అతని వల్లనే సమకూడినాయంట—యుద్ధానంతరం తిరిగి వచ్చేటప్పుడు అతను దారిపొడుగుతా కోసిన కోతలు సుమండీ యివన్నీ !

ఏమన్నా, ఇల్లు చేరుకోవడంలో అతను పక్కా సివిలియన్ అయిపోయాడు—ఊపిరి లేనివానిలాగు కక్ష్యాంతరాలు దాటాడు. కొత్త మగమల్లే తనాబీలకేసి దూలాలకేసి చూడ సాగాడు. అతని పెండ్లాం లోగుమ్మంలోంచే అతణ్ణి పోల్చీ పోల్చకో—" పోలీ ! పోలీ !" అని కేకేసింది. పోలి ఆ యింటి వంటమనిషి వానిమనిషి కూడాను. చుట్టపు చూపంతా పోలిదే—ఇల్లాలు పట్టపురాణి.

పోలి వెంటనే వంట యింట్లోనుంచి వస్తా—"యజమానిగారి రాక కెదురుచూచేం యీదాకా! రైలే రాలేదో విమానమే పోలేదో అని యోజించాం—బాబులకు కుశలమా?" అంటూ కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు, ముఖం రుద్దుకునేందుకు సబ్బు—తువాలు—తుండుగుడ్డ అన్నీ తెచ్చి మండువాలో పెట్టింది.

సుబేదార్ సుబ్రహ్మణ్యం, మిగిలివున్న మిలిటరీ హోదాతో పోలినిచూస్తూ, ప్రక్కగదిలోకి వెళ్ళి, దిరీసు అదీ

తీసివేసి—ఆ గది యంతా నిర్మానుష్యంగా యున్న దానికి వగచి—"పోలీ!" యని కేకేశాడు—"వస్తున్నాను బాబూ! అమ్మగారు మేడెక్కారు, ఇప్పుడిప్పుడే—ఈ మధ్యను పడగ్గది వదలకుండా యున్నారు. ముప్పొద్దులూ మీ రేపొద్దు వస్తారో యని-తమరు ఫోంచేసి క్రింది గదిలో నిమ్మళించి నేపెట్టే ఫలాహారాలు స్వీకరించి-మాపటికి పైకెక్కుదురుగాని! తత్తర పడకూడదండీ సామీ! మీరు వెళ్ళినప్పటినుండి రోజూ రోజూ పట్టిన బూజులు దులపాల; గోడలకు వెల్లెయ్యాల-గులోబులు ప్లేడ్డులు సరదాల-ఎన్నిహంగులు ఏర్పాటు కావాల? ఇంత కాలాని కొచ్చారు! ఎంతో రాజ్యం జయించారు! ఏం పట్టు కొచ్చారు? నాకేం తెచ్చారు? మీ రాణీగారి కేం తెచ్చారు?—సుబేదార్‌గారూ!" అని అంది చిరునవ్వు నవ్వుతూ పూర్వ పరిచయం నెమరుకు తెచ్చుకున్నదై.

వంటింట్లో పులావులు, మసాళాలు, కోడిగ్రుడ్లు, వాడిగా వాసన కొడుతున్నాయి సుబ్రహ్మణ్యంకు.

స్నానమాడి తిన్నగా వంటిల్లు జొరబడి పోలి వడ్డించిన పదార్థాలన్నీ స్విష్టకృతుగ భుజించి, పోలి సలహా ననుసరించి, పొద్దు కూకేదాకా వొద్దిక సందెలడేదాకా సందె వెలుగులు సమసి శయ్యా సంబరాలవేళ అయ్యేదాకా-కిందనే కాలక్షేపం గావించాడు. పోలితో మాటిమాటికీ "పోలీ" యంటూ, పోలికూడా తనకు సుబ్రహ్మణ్యం తెచ్చిపెట్టిన కొత్త వోణీ కొత్త కబ్బా ధరించు కొన్నదై సుబ్రహ్మణ్యంకు పగలంతా కావలసినంత సరదా తీర్చింది.

"పోలే ఇలాగుంటే—ఇంతగా తనను ఎత్తేస్తూవుంటే అలి యెలాగుండెనో అని ఊరికే సుబ్రహ్మణ్యం ఉవ్విళ్ళూరి పోసాగాడు." ఎప్పుడు ఎప్పుడు ఇల్లాలి దర్శన మన్నట్టు.

ఎట్టకేలకు పోలి "మేడమీదకు దారి తమ రెరుగున్నదేగా! ఇలా యెక్కండి!" అంది సరిగా రాత్రి గోడగడియారం పది కొడుతూవుంటే— సుబ్రహ్మణ్యం మెట్లకమ్మి పట్టుకు మేడెక్కుతూ వెనుదిరిగి "పోలీ! మీ అమ్మగారు చిక్కిపున్నారా యేమి? నెలనెలా నే పంపిన రెండువందలు అందేవా ఆమెకు?" అన్నాడు. "తినబోతూ రుచులడుగుతారు తమరు! మీరంపిన వందలూ అందేవి, ఆమె పుట్టింటా రంపే వేలూ చేరేవి—నన్ను చూస్తూయున్నారా? నాలో తీతాకోతా వుందా? అలాగ్గానే అమ్మగారూ ఈ మూడు ఏండ్లనుంచి ఆనందంగానే కాలంపుచ్చేరు. అయితే తమరు లేనిలోటు ఆమెకూ నాకూకూడా అంగుట్లో మెతుకు దిగనిచ్చేది కాదు. మమ్మల్ని మేడెక్కనిచ్చేది కాదు. తమరు వస్తారంటే ఈ పొద్దే ఆ తల్లి మేడెక్కింది నేను మేడ ధులిపించి. మఱి ఆలోచించకండి! ఆలసించకండి! అమ్మగారు కులాసాగా నున్నారు. విలాసం కాపరుస్తారు. ఏటొచ్చీ మూడేండ్ల విరహం ఒక్కమాటుగా తట్టుకోలేక ఒక్కొక్క మెట్టే మీ రెక్కుతూవుంటే, వింటూ విడగొట్టుకోవాలని ఆమె కోరిక—తమరు పదండి పైకి—నాకు సెలవు" అంది పోలి.

సుబేదార్ సుబ్రహ్మణ్యం, పోలి చెప్పినదంతా నిజమే ననుకున్నాడు—నమ్మాడు పూర్తిగా ఆ ముండను ఆ వెఱ్ఱిముండావాడు—మెట్లెక్కి పడగ్గదిలో తాను ప్రవేశించే అంతలో అలి ఎదురొచ్చి తనను గాఢాలింగనం గావించుకుని ఏకండీపూసెజ్జ

మీద పండపెట్టుకు పొరలిస్తుం దనుకున్నాడు. మెట్లన్నీ ఎక్కాడు టకటక—పడకగది తలుపు గొళ్ళెమేసి లేదు కాని మూసివుంది. సన్నగా తోశాడు. విడింది—బార్లాచేశాడు—గది అంతా కనబడింది.

డబుల్ కాట్‌యొక్క రెండు మంచాలూ దూరదూరంగా వున్నాయి. వీపే చూపిస్తూ ఆమె "మీరు ఆ మంచంమీద పరుండండి. చటుక్కున నా మీద పడేరు గనక" అంది. "మోమన్నా చూపవదేమే చెలియా!" అనే జావళీ ఓకొత్త దెత్తుకోవాలనుకొన్నాడు గాని సుబ్రహ్మణ్యం జంకి గొంకి వూరుకున్నాడు. ఆమె చూపించిన మంచంమీదనే వొరిగాడు. వొరుగుతూ "ఏం! ఎల్లాగుందేం?" అన్నాడు సుబ్రహ్మణ్యం. ఆమె, ఆ యింతి అటు తిరిగే అంది "బాగానేవుంది. కాని రాగలిగారా పోలిని విడిచి పైకి?" అని అడిగింది.

అప్పుడు సుబ్రహ్మణ్యం ఇదంతా పోలి పన్నిన కృత్రిమ పన్నాగమని తన ఆలి నిర్దోషి అని తలపోసికొంటూ నిరుత్తరంగా ఇలా అన్నాడు! "తాన మాడకుండా బోనంకాకుండా సందెలడకుండా మేడెక్కడమెలా అనుకున్నావు క్షమించు!" అన్నాడు. "క్షమించడానికేం లేండి! ఈ మూడేండ్లనుంచి ఎంత మంది పొలతుల్ని పోలిలాంటి వాళ్ళని ఆలిలాంటి వాళ్ళని చూచి వున్నారో!" "వొట్టు! వొక్కళ్ళను చూడలేదు పిల్లా! ఇల్లా తిరుగు—ఇటుచూడు! ఒక్కళ్ళను కోరలేదు." "మీకు ఈ మూడేళ్ళనుంచి ఆడదానిమీదకు మనసే పోలేదంటారా?" అని గద్దించింది చూడకుండా అద్దంలో కనబడేలా.

సుబేదార్ సుబ్రహ్మణ్యం ఆ వంకకు మీసం మెలిద్రిప్పుతూ "యుద్ధభూమిలో మగవాని కసలు ఆడదానిమీదకు

బుద్ధిపోవడమే ? పోయిందో రంభే వానిముందు! చచ్చి వీర స్వర్గ మందుకుంటూ రంభనే కౌగిలించు కుంటాడు. ఈ తుచ్ఛ మర్త్యకామినులే కావాలా వానికి! లెగు—ఇదా నీ విరసానికి హేతువు" అన్నాడు. ఆమె "లెగడానికేం! లెగుస్తాను—ఆడది యుద్ధభూమిలో చస్తే ఎవరిని స్వర్గలోకంలో కావులించు కొంటుందో?" ఇంకా ఆమె ముఖం గోడెంపుకే వుంది. సుబ్రహ్మణ్యానికి రిమ్మెత్తి "ఆడది యుద్ధంలో చచ్చినా ఏమీ లేదు. వంటిట్లో చచ్చినా ఏమీలేదు. ఆలాంటి ఆశ యెదో పెట్టుకు ఏ నూతిలోనో గోతిలోనో దిగేవు గనక, మతేదన్నా ఓఘాయిత్యం చేసేవు గనక—" అన్నాడు వొరిగినవాడు వొక్కింత తలెత్తి.

భార్య "ఈ గండం గడవనివ్వండి! ఆ ఓఘాయిత్యం మాట ఆలోచిద్దాం!" అని వెల్లకితలా తిరిగి పడుకుంది. నల్లని చనుమొనల దిగు చాయనే ఆమెకు నెలలు నిండిన కడుపు!

సుబ్రహ్మణ్యం "ఎన్నోమాసం?" అని అడిగితే మూడు తొమ్మిదిలు మోసేనంది. నాలుగేండ్లల్లో ఒక్కమూడు తొమ్మిదులేనా? అని మగడడిగితే, పెళ్ళాం "పోలిని కనుక్కో" మంది.

పోలెక్కడుంది? క్రిందలేదు. సందులోనూ లేదు. అక్కడికక్కడే. ఎవరికేకకు అది మళ్ళీ అందింది లేదు.